E69 NEWS
తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :184 శనివారం 13 జూన్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## 21 సీట్లతో రాజీపడలేదు ఏపీ కోసం మేం త్యాగం చేశాం!


2 లో

**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి ఏర్పాటులో జనసేన 21 సీట్లతో రాజీపడలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిందని స్పష్టం చేశారు. ప్రజలు తమ త్యాగాన్ని గుర్తించి 100 శాతం విజయాన్ని అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సమిష్టిగా కృషి చేస్తోందని పవన్ తెలిపారు.

# స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు

## ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం



2 లో

**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చేరవేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న వర్క్ బుక్స్ 2026-27 విద్యా సంవత్సరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైతం కొత్తగా వర్క్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెరగడానికి వర్క్ బుక్స్ ఉపయోగపడుతాయని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు సుమారు 12 లక్షల మంది వరకు ఉంటారు. అయితే వర్క్ బుక్స్ ఈ నెలాఖరు లేదా జులై మొదటివారంలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్


2 లో

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి

### సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్


2 లో

# 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము

## నారా లోకేష్ మాస్ వార్నింగ్!


2 లో

**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి జిల్లా దామినీడు వేదికగా శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ముఖ్య అథిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. రప్పారప్పా అంటే తాము చూస్తూ ఊరుకోమని, రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూ పోతుందని ప్రతిపక్షంకు వార్నింగ్ ఇచ్చారు.

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో భూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు.

గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.

# రెండేళ్లలో ఏపీకి కొత్త దిశ

- రెండేళ్ల పాలనకు మైలురాయి
- ఏపీ బ్రాండ్ ఇమేజ్‌కు బూస్ట్
- భారీ పెట్టుబడుల ప్రవాహం
- రూ.23 లక్షల కోట్ల ఎంఓయూలు
- ఉద్యోగాలపై భారీ ఆశలు
- డీఎస్సీ, పోలీస్ నియామకాలకు ఊపు
- సూపర్-6 హామీల అమలు
- పెన్షన్లు రూ.4 వేలకు పెంపు
- దీపం-2తో ఉచిత సిలిండర్లు
- తల్లికి వందనం.. ఖాతాల్లో నగదు
- రైతులకు సుఖీభవ అండ
- ఆడబిడ్డ నిధి ఇంకా పెండింగ్
- నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపులు
- అమరావతికి మళ్లీ మంచి రోజులు
- అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లుగా



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత.. నారా చంద్రబాబు నాయుడు ఏపీ సీఎంగా ప్రమాణం చేయగా.. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ మంత్రిగా కీలక బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. మరి కూటమి రెండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారింది..? ఏయే విషయాల్లో కూటమి ప్రభుత్వం సానుకూల ఫలితాలు సాధించింది.. ఏయే హామీలు నెరవేర్చలేకపోయారు, ఇంకా ఏమేం చేయాల్సి ఉందనేది చూద్దాం.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన అతిపెద్ద మార్పు ఏపీ బ్రాండ్ వాల్యూ పెరగడం. రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా మద్దతు ఉంటుందని పారిశ్రామికవేత్తల్లో గట్టి నమ్మకం కలిగించడంలో కూటమి సర్కారు విజయం సాధించింది. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన స్పీడ్ ఆఫ్ బిజినెస్ విధానం చక్కటి ఫలితాలను ఇచ్చింది.

ప్రభుత్వం నుంచి భరోసా లభించడం, కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉండటంతో.. ఏపీకి గత రెండేళ్లలో భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఈ రెండేళ్లలోనే దాదాపు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబర్చాయి. సుమారు రూ. 23 లక్షల కోట్ల విలువైన ఎంఓయూలు కుదిరాయని ప్రభుత్వం తెలిపింది. ఈ రెండేళ్ల కాలంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో నాలుగో వంతు వాటా ఏపీకి దక్కడం విశేషం.

మిగతాది 2 లో..

## కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది: పవన్ కళ్యాణ్


2 లో

**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుపతిలోని దామినీడులో నిర్వహించిన కూటమి రెండేళ్ల పాలన సభలో ఆయన మాట్లాడుతూ.. 2024లో ప్రజలు భయాన్ని, అహంకారాన్ని తిరస్కరించారని అన్నారు.

## రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్

### పరిస్థితులే నన్ను ఈ స్థాయికి తెచ్చాయంటూ సంచలన పోస్ట్


2 లో

ప్రజలు మౌనంగా కనిపించినా అవసరం వచ్చినప్పుడు చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలది కాదని ప్రజల విజయం అని అన్నారు. ఈ కూటమి అధికారాన్ని పంచుకోవడానికి ఏర్పడింది కాకుండా బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడిందని అన్నారు.

## ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ..
## పిటిషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ ఆవేదన

మొదటి పేజీ తరువాయి



పిటిషన్ ను రిజెక్ట్ చేయడం కేవలం తన వ్యక్తిగత ఓటమి మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే పెద్ద దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంలో ఉన్న అధికారులు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడులకు లొంగిపోయారని తాను మొదటి నుంచీ చెప్తూనే ఉన్నానన్నారు. నామినేషన్ ను రిజెక్ట్ చేయడంపై తమ పార్టీ ప్రతినిధులు ఈసీని సంప్రదిస్తే 48 గంటలపాటు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని వాపోయారు. ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె.. సుప్రీంకోర్టు తీర్పుపై మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనన్నారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్ష నిర్ణయం ఇప్పుడు ప్రజలందరికీ అర్థమైందని పేర్కొన్నారు. కాగా.. ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి నిరసనగా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం దేశ రాజధాని న్యూఢిల్లీలో భారీ ఎత్తున 'సత్యాగ్రహ' నిరసన చేపట్టాయి. ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగి ప్రతిపక్షాల గొంతు నొక్కేలా ఈసీ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది: పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



ప్రజలు మౌనంగా కనిపించినా అవసరం వచ్చినప్పుడు చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలది కాదని ప్రజల విజయం అని అన్నారు. ఈ కూటమి అధికారాన్ని పంచుకోవడానికి ఏర్పడింది కాకుండా బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడిందని అన్నారు.

కూటమిలో జనసేన 21 సీట్లు సర్దిపెట్టుకున్న సమయలో చాలా మంది విమర్శించారని చెప్పారు. కానీ తాము ఏపీ భవిష్యత్ కోసమే జనసేనను 21సీట్లకు పరిమితం చేశామని అన్నారు. వందశాతం స్ట్రైక్ రేట్ సాధించామని చెప్పారు. వ్యవస్థ బలహీనపడినప్పుడే ప్రాంతీయత ముందుకు వస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం కులాల పరిమితులు దాటాలని, అందరూ భారతీయత వైపు వెళ్లాలని వ్యాఖ్యానించారు. గ్రామ సమస్యలకు పరిష్కారం గ్రామంలోనే వెతకాలని సూచించారు. ప్రజల జీవితాల్లో సమస్యలను ప్రజల్లోనే వెతకాలని అన్నారు. అందుకే గ్రామసభలను కేవలం అధికారిక సమావేశంలా కాకుండా గ్రామ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువు కావాలన్నారు.

## రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్
### పరిస్థితులే నన్ను ఈ స్థాయికి తెచ్చాయంటూ సంచలన పోస్ట్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** తమిళనాడు రాజకీయాల్లో రోజుకో కొత్త మార్పు చోటుచేసుకుంటోంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ ప్రతిష్టాత్మక స్థానంలో విజయ్ టీవీకే పార్టీ తరపున నటుడు రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోందిరాఘవ లారెన్స్ తన పోస్ట్‌లో స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ నిజాయితీగా, నా బాధ్యతను సక్రమంగా నిర్వహించాలనే అనుకున్నాను. కానీ, ఒకరోజు నేను రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదు. నాకు రాజకీయాల్లోకి రావాలనే కోరిక గానీ, రాజకీయం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆశ గానీ, ఏదైనా పెద్ద పదవిని దక్కించుకోవాలనే లాలస గానీ ఎప్పుడూ లేదు.

నేను నమ్మిన వ్యక్తి, నాకు అత్యంత సన్నిహితుడైన ఒకరు రాజకీయాల్లోకి వస్తే.. వారికి మద్దతుగా నిలిచి, నేను వ్యక్తిగతంగా చేస్తున్న సేవా కార్యక్రమాల కంటే పెద్ద ఎత్తున ప్రజలకు సేవ చేయాలని మాత్రమే అనుకున్నాను. కానీ, నేటి పరిస్థితులు నన్ను రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా చేశాయి" అని పేర్కొన్నారు. రాజకీయాలపై తన మనసులోని మాటను పంచుకుంటూ.. " రాజకీయంపై నా అభిప్రాయం ఏంటి? అది నా జీవితంలోకి ఎలా వచ్చింది? రాజకీయాలపై నా తల్లి ఆలోచనలు ఏంటి? అలాగే నా ప్రయాణాన్ని మార్చిన కొన్ని ముఖ్యమైన, ఆసక్తికరమైన సంఘటనలు ఏంటనే విషయాలను ఎలాంటి దాపరికం లేకుండా, పూర్తి నిజాయితీతో వీడియోలో పంచుకున్నాను" అని లారెన్స్ వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణంపై అభిమానులకు, ప్రజలకు లారెన్స్ ఒక కీలకమైన విజ్ఞప్తి చేశారు.

ఎటువంటి స్వార్థం, ప్రతిఫలం ఆశించకుండా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆయన కోరారు. తన వీడియో చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్ల రూపంలో తెలియజేయాలని అన్నారు. ఒకవేళ ప్రజలు వద్దని చెబితే, తాను ఎంత మాత్రం రాజకీయాల్లోకి ప్రవేశించనని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే సమాజానికి తాను చేస్తున్న నిస్వార్థ సేవలను ఎప్పటిలాగే కొనసాగిస్తానని చెప్పారు. అలా కాకుండా ప్రజలంతా రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటే మాత్రం.. అందరి ఆశీస్సులతో, తాను అనుకున్న వ్యక్తులతో కలిసి ఈ సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నానని లారెన్స్ తన మనసులోని మాటను బయటపెట్టారు. ఈ ప్రకటనతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి
### సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై గుర్తుతెలియని దుండగులు రాళ్లు రువ్విన ఘటన ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర కలకలం రేపింది. ఫిరోజాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ రాళ్ల దాడిలో మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న ఏసీ ఫస్ట్ క్లాస్ బోగీ (ఈ1) కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అయితే, ఈ ప్రమాదంలో మోహన్ భాగవత్‌తో పాటు ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారుల కథనం మేరకు కాన్పూర్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రాత్రి 7.15 గంటల సమయంలో ఫిరోజాబాద్‌లోని రసూల్‌పూర్, దక్షిణ్ పోలీస్ స్టేషన్ సరిహద్దు ప్రాంత గుండా వెళ్తోంది. ఈ క్రమంలోనే కొందరు దుండగులు ఒక్కసారిగా రైలుపైకి రాళ్లు విసిరారు. ఓ పెద్ద రాయి మోహన్ భాగవత్ కూర్చున్న సీటు వైపు ఉన్న కిటికీకి బలంగా తగిలింది. దీంతో కిటికీ బయటి వైపు ఉన్న గ్లాస్ పూర్తిగా పగిలిపోయింది. ఆ సమయంలో యూపీ పంచాయతీ రాజ్ మంత్రి భూపేంద్ర చౌదరి కూడా అదే బోగీలో ప్రయాణిస్తున్నట్లుగా సమాచారం.

అప్రమత్తమైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్..

అయితే, ఘటన జరిగిన వెంటనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్ఎఫ్), గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఆగ్రా జోన్ ఏడీజీ ఎస్‌కే భగవత్, ఫిరోజాబాద్ ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే స్పాట్‌కు చేరుకున్నారు. రైలును కాసేపు తుండ్లా జంక్షన్ వద్ద నిలిపివేసి తనిఖీలు చేసిన అనంతరం ఢిల్లీకి సురక్షితంగా పంపేశారు. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఇప్పటికే అనుమానితుడైన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రైల్వే ట్రాక్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, నిందితులను త్వరలోనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే తెలిపారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా
### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగానే వ్యవహరించిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్ ఎంతో నిబద్ధత, నిజాయితీ కలిగిన మహిళా నాయకురాలని అన్నారు. అలాంటి లీడర్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్‌లో తిరస్కరించడం అత్యంత అన్యాయమని అన్నారు. తనకు తెలిసినంత వరకు ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, కోర్టుల్లో ఎలాంటి వివాదాలు పెండింగ్‌లో లేవన్నారు. కనీసం ఆమె రాజకీయ జీవితంలో ఎలాంటి నిరసనలు, రాస్తారోకోలు, రాజకీయ గొడవల్లో పాల్గొన్నట్లుగా కూడా రికార్డుల్లో లేదన్నారు. ఆమె వ్యక్తిగత జీవితంలోనూ ఎలాంటి చట్టపరమైన సమస్యలు లేకుండా.. అంతటి క్లీన్ రికార్డ్ ఉన్న నేతను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసీని ముందు పెట్టి రాజకీయం..

మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కావాలనే ఎన్నికల సంఘాన్ని వాడుకుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా చేసిందని జగ్గారెడ్డి విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముందు నిలబెట్టి, ఓ రకంగా తాము అనుకున్న కుట్రలో విజయం సాధించిందని అన్నారు. ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఏముందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. విపక్ష నాయకులను టార్గెట్ చేయడానికి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

## స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు..
### ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి




పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాల నుంచి స్కూళ్లకు చేరుకోగా నోట్ బుక్స్ ఇంకా చేరలేదు. పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పలు సూచనలు చేసింది.

రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు..

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ డీఈఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రవాణా, పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రోజువారీ సరఫరా నివేదికలను ట్రాక్ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులతో కలిసి బుక్స్ ట్రాలీలో తీసుకొస్తుండగా బోల్తా పడింది. అందులో విద్యార్థులు ఉండడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ ఏడాది అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, పాఠశాల ప్రారంభం నాటికే బుక్స్‌తోపాటు అన్ని మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వంద శాతం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము..
### నారా లోకేష్ మాస్ వార్నింగ్!

మొదటి పేజీ తరువాయి



వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మాది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి. మనది కియా అయితే.. వారిది కిడ్నాప్' అని విమర్శించారు. అలాగే 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## రెండేళ్లలో ఏపీకి కొత్త దిశ

మొదటి పేజీ తరువాయి

అనకాపల్లిలో రూ. 1.35 లక్షల కోట్ల విలువైన ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టర్ స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. రామాయపట్నంలో దాదాపు లక్ష కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. విశాఖలో లక్ష కోట్లకుపైగా విలువైన గూగుల్ డేటా సెంటర్‌కు సైతం శంకుస్థాపన జరిగింది. విజయనగరంలో రిలయన్స్ డేటా సెంటర్‌తోపాటు పుట్టపర్తిలో డిఫెన్స్ పరిశ్రమలు, కర్నూలులో డ్రోన్ సిటీ.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖపట్నానికి ఐటీ సంస్థలను తీసుకొచ్చేందుకు లోకేశ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఈ పరిశ్రమలన్నీ ఏర్పాటైతే, ఎంఓయూలు పెట్టుబడులుగా మారితే రాష్ట్రంలో 23 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఇక ప్రభుత్వ ఉద్యోగాల విషయానికి వస్తే.. డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వం.. 5757 కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీని సైతం వేగవంతం చేసింది.

2024 ఎన్నికల ముంగిట టీడీపీ సూపర్-6 పేరిట ప్రజలకు కీలక హామీలు ఇచ్చింది. అందులో భాగంగా సామాజిక ఫించన్లను రూ. 4 వేలకు పెంచారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఫించన్లను పంపిణీ చేస్తున్నారు. దీపం-2లో పథకంలో భాగంగా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించడంతోపాటు.. తల్లికి వందనం పథకం కింద పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో ఏటా రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు.

అయితే 18-59 ఏళ్ల వయసున్న ప్రతి మహిళకు ప్రతి నెలా రూ. 1500 చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు ఉద్దేశించిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 చొప్పున నిరుద్యోగ భృతి ఇంకా అమలు కాలేదు. ఈ రెండు పథకాలు అమలు చేయడానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం. ప్రభుత్వం దగ్గర సరిపడా నిధులు లేకపోవడంతో ఈ పథకాన్ని అమలు చేయలేకపోతున్నారు. అయితే బాబు మళ్లీ మాట తప్పారని ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ విమర్శలు చేస్తోంది.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో గతంలో రోడ్ల మీద గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు ఇప్పుడు కాస్త రిలీఫ్‌గా ఫీలవుతున్నారు.

ఏపీ రాజధాని అమరావతికి కూటమి ప్రభుత్వంలో మళ్లీ మంచి రోజులు వచ్చాయి. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట అమరావతిని పట్టించుకోలేదు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతిలో నిర్మాణాలు తిరిగి ప్రారంభం అయ్యాయి. 2014 నాటి విభజన చట్టానికి సవరణలు చేసిన కేంద్రం.. ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించింది. దీంతో మూడు రాజధానుల ప్రతిపాదనకు చెక్ పెట్టినట్లయ్యింది. కేంద్రం కూడా అమరావతి అభివృద్ధి కోసం రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. రాజధాని ప్రాంతంలో పనులు తిరిగి ప్రారంభం కావడంతో.. అమరావతి పరిధిలోని 29 గ్రామాలతోపాటు, చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ భూముల ధరలు పెరిగాయి.

కూటమి ప్రభుత్వం ఈగిల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తోంది. అన్నా క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఓవరాల్‌గా చెప్పాలంటే.. ఈ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడ్డాయి. చంద్రబాబు ముందు చూపు, కేంద్రం వద్ద పరపతి పెరగడం.. పవన్ కళ్యాణ్ ప్రజాకర్షణ, కూటమిలో విభేదాలు రాకుండా సమన్వయం చేసుకోవడం.. పెట్టుబడుల కోసం లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లో సానుకూలతను పెంచాయి. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా.. రాష్ట్రాన్ని సరైన ట్రాక్‌లోకి మళ్లించారనే నమ్మకాన్ని కలిగించారు.

అయితే సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిపోయిన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను అమలు చేయడం.. అమరావతి నిర్మాణాన్ని ఓ కొలిక్కి తీసుకురావడం, పోలవరం నిర్మాణం పూర్తి చేయడం లాంటి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

## పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో పూర్తి స్వేచ్ఛ ఉంది
### సభకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ క్లారిటీ



**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెలంగాణలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పర్యటనలు, శాంతిభద్రతలు మరియు మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణలో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్పష్టత ఇచ్చారు. కేవలం శాంతి భద్రతలను పరిగణలోకి తీసుకుని మాత్రమే పోలీసులు ఆ నిర్ణయం తీసుకున్నారని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. "తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆయనకు నచ్చినట్లు ఆయన రాజకీయాలు చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరైనా పోటీ చేయడానికి అర్హులే" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఓట్ చోరీ అయిపోయింది.. ఇప్పుడు సీట్ చోరీ: బీజేపీపై ఫైర్

ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను బీజేపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఆయన మండిపడుతూ.. ఇది ముమ్మాటికీ కుట్రపూరిత చర్యేనని ఆరోపించారు. "మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. అయినప్పటికీ ఆమె నామినేషన్ను తిరస్కరించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి పూర్తిగా తప్పుగా వ్యవహరించారు. దేశంలో మొదట ఓట్ల చోరీ జరిగింది.. ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి పాల్పడుతున్నారు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 21 సీట్లతో రాజీపడలేదు.. ఏపీ కోసం మేం త్యాగం చేశాం!

మొదటి పేజీ తరువాయి

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో అందరి సహకారం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని జనసేనాని చెప్పుకొచ్చారు.

వ్యవస్థలు బలహీనపడినప్పుడు కులం, ప్రాంతీయత వంటి అంశాలు ముందుకు వస్తాయని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఒక రాష్ట్రం కుల రాజకీయాలను అధిగమించాలని, మరో రాష్ట్రం ప్రాంతీయత భావనను దాటాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 'ప్రజలు పార్టీలను మాత్రమే కాకుండా వ్యవస్థలను కూడా నమ్మాలి. నాయకులను కాకుండా సంస్థలను విశ్వసించాలి. వ్యక్తులను కాకుండా విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం, గ్రామ స్వరాజ్యం సాకారం అవుతాయి' అని పవన్ అన్నారు.



రాష్ట్రంలో 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని వివరించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంచేందుకు కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిస్థితి దయనీయంగా ఉండేదని విమర్శించారు. కనీస అవసరాలకు కూడా నిధులు లేని పరిస్థితులు ఉండేవని, తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేశానని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసిన పవన్.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రజలకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నల్లబెల్లి (వి)లో విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి గేదె బలి

- ఎర్త్ వైరుకు కరెంట్ రావడంతో అక్కడికక్కడే మృతి,లక్ష రూపాయల జీవనాధారం కోల్పోయిన రైతు
- 'ప్రభుత్వం ఆదుకోవాలి'- బాధితుడు
- ఆరేల్లి ఎల్లయ్య వేడుకోలు,గ్రామంలో ప్రమాదకర లైన్లు సరిచేయాలని డిమాండ్

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/జూన్ 12**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అలసత్వం ఒక నిరుపేద రైతు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. గ్రామానికి చెందిన ఆరేల్లి ఎల్లయ్య ప్రతిరోజూలాగే తన గేదెలను మేపడానికి తీసుకెళుతుండగా,విద్యుత్ స్తంభం నుంచి వచ్చే ఎర్త్ వైరుకు కరెంట్ సరఫరా కావడంతో ఒక గేదె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.కుటుంబానికి పెద్ద దెబ్బ: సూది పాడి గేదె మృతి

సుమారు లక్ష రూపాయల విలువ చేసే సూది పాడి గేదె ఒక్కసారిగా మృతి చెందడంతో ఎల్లయ్య తీవ్ర దుఃఖంలో మునిగిపోయాడు.“ఈ గేదె పాల మీదే నా కుటుంబం ఆధారపడి బతుకుతోంది.ఇప్పుడు ఆ ఆదాయం పూర్తిగా ఆగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలి”అంటూ కన్నీరుమున్నీరయ్యాడు. తన జీవనోపాధిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

ఇది ముమ్మాటికీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని బాధితుడితో పాటు గ్రామస్తులు మండిపడుతున్నారు.గతంలోనే పలుమార్లు వదులుగా ఉన్న వైర్లు, ఎర్త్‌కు కరెంట్ వస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు.“ఈ రోజు గేదె పోయింది, రేపు మనుషులు పోతే ఎవరు బాధ్యత వహిస్తారు?”అని ప్రశ్నిస్తున్నారు.



తక్షణ చర్యలు చేపట్టాలి: గ్రామస్తులు గ్రామంలో ఇంకా అనేక చోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని,ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర రక్షణ చర్యలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామంలో పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టి, ప్రమాదకర పరిస్థితులను సరిచేసి విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బాధిత రైతు ఆరేల్లి ఎల్లయ్యకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గూడూరు లో రావూరి ఆద్వర్యంలో జలగం 27 వర్ధంతి”

**ముఖ్య అతిథిగా పాల్గొన్న కాసర”**



వేంసూరు,జూన్12(తెలుగు గళం)న్యూస్: ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల అతి చిన్న గ్రామం గూడూరు లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్రమంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జలగం వెంగళరావు 27 వ వర్ధంతి శుక్రవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి రావుల పుల్లారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసరచంద్రశేఖర్ రెడ్డి పాల్గొని జలగం వెంగళరావు విగ్రహానికి పూలమాల,పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాసర మాట్లాడుతూ నాడు అడవులతో నిండిపోయి ఉన్న ప్రాంతాన్ని ప్రజలకు నివాస యోగ్యంగా మార్చిన అభివృద్ధి ప్రదాతగా వెంగళరావు తన పేరును లిఖించుకున్నారని తెలిపారు.ఖమ్మంజిల్లాను దేశ మ్యాప్ లో అగ్రభాగాన చూపించిన మహానేత అని ఆయన అడుగుజాడలలో నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో: మండల కిసాన్ సెల్ అధ్యక్షులు గాదె ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, తిరుపతయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మజ్లిస్ తహఫుజె ఖత్మేనబువ్వత్ సంస్థపై ఫిర్యాదు చేసిన అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రతినిధులు

**మతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు- ఎస్సై మహేందర్ రెడ్డి**



**తెలుగు గళం న్యూస్ న్యూస్, తొర్రూరు, జూన్ 12**

మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడం, అసత్య ప్రచారాలతో సామాజిక సామరస్యానికి భంగం కలిగించడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తొర్రూరు ఎస్సై మహేందర్ రెడ్డి హెచ్చరించారు.అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రతినిధులు బుధవారం తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీకి వ్యతిరేకంగా మజ్లిస్ తహఫుజె ఖత్మేనబువ్వత్ అనే సంస్థకు చెందిన కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎస్సై దృష్టికి తీసుకెళ్ళారు.తమ కమ్యూనిటీ సభ్యుల బంధువుల్లో వివాహ సంబంధాలు జరగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని, తప్పుడు ప్రచారాల ద్వారా ప్రజల్లో అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇటువంటి చర్యలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొంటూ సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం కమ్యూనిటీ ప్రతినిధులు అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ చరిత్ర, లక్ష్యాలు, ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న మానవతా, విద్యా, వైద్య మరియు సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు.ప్రపంచంలోని అనేక దేశాల్లో శాంతి, సౌభ్రాతృత్వం, మానవ సేవల కోసం కమ్యూనిటీ కృషి చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రపంచాధినేత హజ్రత్ మీర్జా మస్రూర్ అహ్మద్ రచించిన “ప్రపంచ సంక్షోభం మరియు శాంతి మార్గం” గ్రంథాన్ని ఎస్సై మహేందర్ రెడ్డికి బహూకరించారు.ఎస్సై మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎవరు అయినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించినా లేదా మతాల పేరుతో విద్వేషాలను ప్రేరేపించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ యాకూబ్ పాషా (కలీముల్లాహ్), ఉపాధ్యక్షుడు ముహమ్మద్ సలీం, సర్కిల్ ఇన్‌చార్జి ఆసిఫ్ అహ్మద్ ఖాదిం, మాజీ జిల్లా కమిటీ సభ్యుడు ముహమ్మద్ ఇబ్రాహీం, కాట్రపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ముహమ్మద్ సత్తార్, వరంగల్ పట్టణ మిషనరీ ఇన్‌చార్జి మౌల్వీ అయాన్ పాషా, చిట్యాల, నాంచారి మడూరు గ్రామాల మౌల్వీలు అయ్యూబ్, ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా జువారి రమేష్ మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక



**తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 12**

జఫర్‌గఢ్ మండలం ముఖ్దుంబండ తాండ గ్రామ పరిధిలోని అవుసల తాండకు చెందిన జువారి రమేష్ తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వామపక్ష విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న జువారి రమేష్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ బాధ్యతను మరోసారి చేపట్టడం పట్ల గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.జనగామ జిల్లా కేంద్రంలోని గొబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో నిర్వహించిన తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ సమక్షంలో ఆయనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జువారి రమేష్ మాట్లాడుతూ తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న సభ్యులకు, సంఘం సానుభూతిపరులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో గిరిజనులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అఘాయిత్యాలపై గిరిజనులను సమీకరించి ఉద్యమాలు చేపడతానని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ప్రజాతంత్ర నాయకులకు, గిరిజన సమాఖ్య నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆత్మకూరులో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే బలమైన పునాది**

**చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన చేసిన పరకాల శాసనసభ్యులు**

**మహిళలు, బాలల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట**

**ఆత్మకూరు, జూన్ 12 తెలుగు గళం :**

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని చిన్నారులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్వయంగా అక్షరాభ్యాసం చేయించడంతో పాటు, అన్నప్రాశన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలే బలమైన పునాది అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే: త్వరలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రీ-ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. అంగన్‌వాడీల్లో డైట్ చార్జీలను పెంచడం జరిగిందని గుర్తుచేశారు. అత్యాధునిక విద్యా ప్రమాణాలు, వసతులతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ”చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకం. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు, గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మియాపూర్‌లో విషాదం.. చిన్నారితో సహా ఆరో అంతస్తు నుంచి దూకిన మహిళ



**మియాపూర్ (హైదరాబాద్):** నగరంలోని మియాపూర్ పీఎస్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. చిన్నారితో కలిసి ఆరో అంతస్తు నుంచి దూకి మహిళ మృతిచెందింది. మయూరినగర్‌లో ఈ ఘటన జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈషా సాహూ (37) అనే మహిళ ఆరు నెలల కుమార్తెను తీసుకుని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందికి దూకేసింది. ఈ ఘటనలో ఈషా అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నారిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండో బిడ్డ జన్మించిన తర్వాత ఈషా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పర్వతగిరి లో మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు



**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి/ జూన్12**

పర్వతగిరి మండల కేంద్రంలో విషాదం నెలకొంది. ఇటీవల మరణించిన పలువురు మృతుల కుటుంబాలను సీనియర్ రాజకీయ నాయకులు,మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు శుక్రవారం పరామర్శించారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన జంగా ఎల్లమ్మ, కోటి మల్లమ్మ లు గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేడిశెట్టి రాములు ఈరోజు వారి నివాసాలకు వెళ్లి, మృతుల భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించారు.అనంతరం శోకతప్త హృదయాలతో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,మనోనిబ్బరం కోల్పోకూడదని కోరారు.వారికి తమ పక్షాన ఎల్లప్పుడూ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శించిన వారిలో ప్యాక్స్ వైస్ చైర్మన్ సందెల నవీన్,మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు,జిల్లా పరిషత్ మాజీ సభ్యులు మహ్మద్ సర్వర్ ఉన్నారు.అలాగే స్థానిక నాయకులు గోనె సంపత్, సురేందర్ రావు,కంటెం ఏకాంతం, కొండా వెంకన్న,కంటెం సుధాకర్, ఆదొండ బిక్షపతి,వనం రవీందర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అక్కల రమేష్,పోకల శంకర్, చేరాలు, మండల మైనారిటీ నాయకురాలు సుల్తానా లతో పాటు తదితరులు పాల్గొని మృతులకు అంజలి ఘటించారు.

# భాగిర్తిపేట క్రాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం

**ఆర్టీఓ ఆఫీస్ ఏవో కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు**



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని భాగిరథిపేట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం భయంకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భూపాలపల్లి నుండి హనుమకొండ వైపు వెళ్తున్న పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు, ఎదురుగా హనుమకొండ నుండి భూపాలపల్లి వైపు వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు నడుపుతున్న హనుమకొండ ఆర్టీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న తేజావత్ రజిత (39) తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, కారులోనే ప్రయాణిస్తున్న మరొక ప్రయాణికురాలు భూక్య లక్ష్మి (43)కి అదృష్టవశాత్తు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ప్రయాణికులు స్పందించి క్షతగాత్రులను కాపాడారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వారిద్దరినీ తక్షణ ప్రాథమిక చికిత్స నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం, బాధితులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం హనుమకొండలోని ఎన్ఎస్ఆర్ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజిత, లక్ష్మిల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు, ప్రాణాపాయం తప్పినట్లు వైద్య వర్గాల ద్వారా సమాచారం అందింది. ప్రమాదం జరిగిన సమయంలో పరకాల డిపో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా ప్రధాన రహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



# యంగ్ ఇండియా స్కూల్‌కు రూ.6.50 కోట్ల రహదారి మంజూరు"

## ప్రొసీడింగ్ ఆర్డర్ అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి"



సత్తుపల్లి,ఆర్ సి, జూన్12 (తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలం చెన్నూరు గ్రామం వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు అనుసంధానంగా రహదారి నిర్మాణానికి రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సంబంధిత పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ప్రజాపనుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జోగారెడ్డి, ఖమ్మంజిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందుకున్నారు. చెన్నూరు వద్ద నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయితే పాఠశాలకు చేరుకునే మార్గం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంలో భాగంగానే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రహదారి నిర్మాణంతో చెన్నూరు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడనున్నాయని, ప్రాంతీయ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




తెలుగు గళం న్యూస్
ఆత్మకూరు, జూన్ 12

గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మకూరు, గుడేప్పాడ్, అక్కంపేట, కటాక్షపూర్, కొత్తగట్టు, మల్కపేట, అగ్రంపహాడ్, నీరుకుల్లా, పెంచికలపేట, చౌలపల్లి, లింగమడుగుపల్లి, నాగయ్యపల్లి గ్రామాలకు చెందిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే పెద్దాపురం గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్టీసీ సంస్థ ఆర్థికంగా బలోపేతం అవుతోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు కాంగ్రెస్ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.పెద్దాపురంలో ఏర్పాటు కానున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అలాగే గురుకుల పాఠశాల విద్యార్థుల డైట్ ఛార్జీలను కూడా పెంచినట్లు తెలిపారు.కోతుల బెడద నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.

# అమెరికాతో ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం: ఇరాన్



తెలుగు గళం న్యూస్ :

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాతో ఒప్పందం విషయంలో ఇంతకుముందు లేనంత దగ్గరకు వచ్చామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. అయితే ఈ ఒప్పందాన్ని ఖరారు చేసే వరకు, ఇందులోని అంశాలపై ఊహాగానాలను వ్యాప్తి చేయవద్దని మీడియాకు సూచించారు. చర్చలు పూర్తయిన తర్వాత ఒప్పందానికి సంబంధించిన వివరాలు బహిర్గతం చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు. మరోవైపు ఈ పోస్టు స్క్రీన్‌షాట్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో షేర్ చేశారు.

ఇరాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిన్న పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్‌పై దాడులను విరమించుకున్నట్లు ప్రకటించారు. ఒప్పంద అంశాలకు ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, తుర్కియే, పాకిస్థాన్, బహ్రెయిన్, ఈజిప్టు కూడా సమ్మతి తెలిపాయని సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా వెల్లడించారు. తాజాగా అబ్బాస్ అరాగ్చీ ఈ విషయంపై స్పష్టత ఇవ్వడంతో ఒప్పందం త్వరలోనే కుదరుతుందని భావిస్తున్నారు.

# ఎండలో ఉపాధి కూలీలకు సర్పంచ్ చేయూత:150 మందికి అన్నదానం

- మీ కష్టం గ్రామ అభివృద్ధికి పునాది, మీ ఆరోగ్యం మా బాధ్యత'
- అన్నారం షరీఫ్ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్
- చల్లటి నీరు అందించి వడదెబ్బపై అవగాహన,పనుల నాణ్యతపై కూలీలతో ముఖాముఖి




తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /జూన్ 12

వరంగల్ జిల్లా:పర్వతగిరి,మండే ఎండలను లెక్కచేయకుండా ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీ అండగా నిలిచింది. గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఉన్న సుమారు 150 మంది కూలీలకు గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ అన్నదానం చేశారు.మానవత్వం చాటిన పంచాయతీ,భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ, వారు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు సర్పంచ్ స్వయంగా అందరికీ చల్లటి నీరు అందజేశారు. "మీ కష్టం గ్రామ అభివృద్ధికి పునాది. మీ ఆరోగ్యం మా బాధ్యత" అని సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ ఈ సందర్భంగా కూలీలకు భరోసా ఇచ్చారు.పనులపై ఆరా, కూలీలతో ముఖాముఖి పనుల నాణ్యత, వేతన చెల్లింపులపై కూలీలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను ప్రజాప్రతినిధులు తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉపాధి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామీణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.కూలీల హర్షం

కేవలం పనుల పరిశీలనకే పరిమితం కాకుండా, కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టడం, అన్నదానం చేయడంపై కూలీలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు చూపిన ఈ చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు,మాజీ పంచాయతీ అధికారి అల్లావుద్దీన్, గ్రామ కారోబార్ గుండె యాకయ్య, సీనియర్ మేట్ భాష బోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నారం షరీఫ్ దర్గాలో భక్తి ముసుగులో అక్రమ దందా



## కనీస సౌకర్యాలు లేవు పట్టించుకోని వక్స్ బోర్డ్ అధికారులు

తెలుగు గళం న్యూస్,పర్వతగిరి/ జూన్12


తెలంగాణలో ప్రముఖ యాత్ర స్థలమైన అన్నారం షరీఫ్ యాకూబ్ షావలి దర్గాలో యాటకందూరు చేసిన భక్తులు దేవునికి తల, పొట్ట, కాళ్లు ,అప్పగిస్తారు.టికెట్ 300 ,రూపాయలు వక్స్ బోర్డ్ నిబంధనల ప్రకారం తీసుకొని దర్శనం చేసుకోవాలి కానీ భక్తుల మొక్కులు సమర్పించేందుకు దర్గాకు వెళ్లిన భక్తుల వద్ద ఉన్న పాతియా బ్ఛేషన్ డబ్బాను లాక్కొని 1500 వెయ్యి రూపాయలు గల్లాలో వేస్తేనే మీ మొక్కలు మొక్కు లు దేవునికి ముడుతాయని డబ్బా లాక్కొని బలవంతంగా వసులు చేస్తున్నారు అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు తెలంగాణ రాష్ట్రశీ లో పేరుగాంచిన అన్నారం షరీఫ్ దర్గాలో ఈ అక్రమ వసూళ్లను భక్తులు ఖండిస్తున్నారు భక్తులకు కనీస సౌకర్యాలు పార్కింగ్, సౌకర్యం లేదు భక్తులు వంట చేసుకోవడానికి షెడ్లు లేవు మరుగుదొడ్లు సరిగా లేవు దర్గాకు వచ్చేటువంటి భక్తులు ప్రైవేట్ రూమ్స్ లో చెట్ల కింద కిరాయి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది దర్గా లోపలికి వెళ్తే మూడు నుంచి నాలుగు వేల ఖర్చు అవుతుందని భక్తులు వాపోతున్నారు ఇప్పటికైనా వక్స్ బోర్డ్ అధికారులు స్పందించి వచ్చే యాత్రికులకు కనీస సౌకర్యాలు కల్పించి ఈ దోపిడిని వ్యవస్థను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు

# చేనేత కార్మికులకు పని కల్పించేలా టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

## టెస్కో ద్వారా నేరుగా వస్త్రాల కొనుగోలుకు పద్మశాలి సంఘం డిమాండ్

హైదరాబాద్ (తెలుగు గళం న్యూస్), జూన్ 12


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండిస్తున్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తున్న విధంగానే, చేనేత కార్మికులు నేస్తున్న అన్ని వస్త్రాలను కూడా టెస్కో ద్వారా నేరుగా కొనుగోలు చేసి చేనేత రంగాన్ని సంక్షోభం నుండి ఆదుకోవాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తం మురళి డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కమర్తం మురళి నాయకత్వంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత కార్మికులు, జిల్లా అధ్యక్షుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన ఉపాధి లేక ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యే ప్రమాదకర పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించేలా ప్రత్యేక జీవో విడుదల చేయాలని కోరారు. చేనేత కార్మికులు నేసే వస్త్రాలను టెస్కో ద్వారా నేరుగా కొనుగోలు చేయడం వల్ల వారికి చేతినిండా పని లభించడంతో పాటు ఆర్థిక భద్రత, స్థిరమైన జీవనోపాధి కలుగుతుందని ప్రతినిధులు మంత్రికి వివరంగా



వివరించారు. ఈ వినతిపై చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించి, చేనేత కార్మికుల సమస్యలను సానుభూతితో పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు, వారికి నిరంతర పని కల్పించేందుకు ప్రభుత్వం తరఫున గట్టి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాధం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొప్పెరి వెంకట హరిహర కిషన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, టీపీపీఎస్ ఉపాధ్యక్షుడు వద్నాల నరేందర్, గుర్రం శ్రవణ్, వైద్యం రాజగోపాల్, ఆడెపు సుధాకర్ తదితర ముఖ్య నేతలు, చేనేత కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాలిదుమారానికి తమ్మడపల్లి (జి) అతలాకుతలం

## విద్యుత్ వైర్లపై చెట్లు, అంధకారంలో గ్రామం



తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ జూన్ 12

జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో శుక్ర వారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, దుమారం ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. బలమైన గాలుల ధాటికి గ్రామంలోని పలుచోట్ల చెట్లు విరిగి రహదారులపై, విద్యుత్ వైర్లపై పడిపోయాయి.దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు పలు కాలనీల్లో చెట్లు నేలకొరిగాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ వైర్లపై చెట్లు పడిపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.విషయం తెలుసుకున్న గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అంచనా వేసి చెట్లు, విరిగిన కొమ్మలను తొలగించిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.



# యుద్ధం దృశ్యాలు చిత్రీకరణ.. దుబాయ్ జైల్లో జగిత్యాల యువకుడు



తెలుగు గళం న్యూస్

:పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్త పరిస్థితుల వేళ.. అరబ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దుబాయ్‌లో క్షిపణులు, డ్రోన్ల దృశ్యాలను ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో షేర్ చేసిన పలువురు భారతీయులు సహా అనేక మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వారిలో తెలంగాణలోని జగిత్యాల జిల్లా గుల్లపేటకు చెందిన గోపు భూమేశ్ (26) కూడా ఉన్నట్లు తెలిసింది. దీంతో అతడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాధితుల కథనం ప్రకారం.. గతేడాది నవంబరులో భూమేశ్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అతడికి భార్య సంధ్యారాణి, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు. అయితే, అమెరికా–ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతల వేళ క్షిపణి దృశ్యాలను తన మొబైల్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీన్ని గుర్తించిన స్థానిక పోలీసులు.. భూమేశ్‌పై దేశద్రోహం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం అక్కడి జైల్లోనే ఉన్నాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న కుటుంబ సభ్యులు.. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి భూమేశ్‌ను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.